# ఓటమిలోని మర్మం ★ శ్యామలా ఇంద్రాణి

క్రికెట్ స్టేడియం జన సమ్మర్దంతో కిట కిట లాడుతోంది. ఆ రోజు క్రికెట్ రసికులకు వొక పండుగ దినం.

సరిగ్గా పది గంటలు కొట్టగానే క్రికెట్ ఆటగాళ్ళు విజయ గర్వంతో గంభీర మయిన నడకతో స్టేడియంలోకి ప్రవేశించేరు. మద్రాసు గోష్టికి కాప్టెను గోపాల్ మైదానంలో కాలు పెట్టినదే తడవు ప్రేక్షకుల కర ఘోషలు మిన్ను ముట్టేయి.

"ఈ రోజు గోపాల్ తప్పక సెంచరీ చేసే మరీ వదులుతాడు. మద్రాస్‌కు గెలుపు తన చేతుల్లోనే వుంది." అన్నారు ఆయన. "ఔను మద్రాసు తప్పక గెలుస్తుంది." అన్నాను.

ఆట ప్రారంభ మయింది. మొదటి పందెంలో మద్రాసు జట్టు గెలిచింది. ప్రేక్షకుల, గోపాల్ అభిమానుల ఆనందానికి అంతులేదు. రెండవ పందెం ప్రారంభించేరు. ప్రేక్షకులంతా చాలా వుత్సాహంగా గెలుపు గోపాల్ దేనని యెదురు చూస్తున్నారు. కాని ఆశ్చర్యం! ఎవరూ యెదురు చూడని విధంగా గోపాల్ అవుటయి పోయేడు. ఎంతో వుత్సాహంతో గెలుపు గోపాల్ దేనని యెదురు చూస్తున్న ప్రేక్షకులకి వొక్కసారిగా ఆశా భంగమయి పోయింది. అప్పుడు మా వారి ముఖం చూచేసరికి నాకే జాలేసింది. "ఏదో పెద్ద కారణం లేకపోతే తప్ప గోపాల్ యిలా చేయడు నాకు గోపాల్ ఓడిపోయిన కారణం తెలుసుకోవాలన్న కుతూహలం బయలుదేరింది. ఇంతలో నేనా కోరిక పూర్తి చేయడానికా అన్నట్లు గోపాల్ చేతిలోని బేట్ అలక్ష్యంగా తిప్పుతూ, ముఖం తేలవేసుకుని అటుప్రక్కగా వచ్చి మా వారికి రెండు సీట్ల అవతల కూర్చున్నాడు. చటుక్కున ఆయన నా ప్రక్క నుండి లేచి గోపాల్‌కి ప్రక్కగా వెళ్లి కూర్చున్నారు. వాళ్ళేం మాట్లాడు కుంటారో అన్న కుతూహలంతో నేనూ అటు వైపు చెవులు సారించి వినడం మొదలు పెట్టేను.

"ఏమిటిది గోపాల్ యిట్లా చేశావ్ ఈరోజు? గెలుపు నీదేనని యెదురు చూస్తున్న మా అందరికీ యెందుకిట్లా నిరాశ కలుగ జేశావో కొంచెం చెప్తావా?" అన్నారు ఆయన. గోపాల్ వొకసారి ఆకాశం వంక చూచి నిట్టూర్చాడు. తరవాత నుదుటి మీద పడుతున్న జుత్తుని అలక్ష్యంగా వెనుకకు తీసుకుంటూ "ఔను మిస్టర్ రావ్ మీరే కాదు స్టేడియంలోకి ప్రవేశించే వరకూ నాకే తెలియదు నేనోడి పోతానన్న సంగతి. అయినా యిక మీద గెలుస్తేనేం వోడిపోతేనేం.? ఎవరి కోసమయితే యీ క్రికెట్‌తో యింత పేరు సంపాదించేనో ఆ వ్యక్తి నాకు దూర మయేక యింకెవరికోసం క్రికెట్‌లో గెలుపూ ఓటమీ?" అన్నాడు విరక్తిగా. "ఆగు గోపాల్ యేమిటీ వేదాంతం? ఎవరో వ్యక్తికీ క్రికెట్‌కీ సంబంధం యేమిటి? కొంచెం వివరంగా చెపుదూ?" అన్నారు. ఆయన "ఔను. నా జీవితమే వొక కథగా మారి పోయింది. మీతోనైనా నా విషాధ గాథ చెప్పుకుంటే నా మనస్సుకి కాస్తైనా శాంతి వుంటుందేమో. వినండి చెప్తాను" అని గోపాల్ ప్రారంభించేడు. మేమంతా క్రికెట్ స్టేడియం. మఱచిపోయి గోపాల్ చెప్తున్న కథలో లీనమయి పోయేం. గోపాల్ యిలా చెప్పడం మొదలు పెట్టేడు.

"అవి నేను హైస్కూల్లో చదివే రోజులు. చిన్నప్పట్నించీ నాకు చదువులో శ్రద్ధ తక్కువ. కాని గేమ్స్ అంటే చాలా యిష్టం. స్కూల్లో జరిగే మేచస్ అన్నిటికీ కాప్టన్ నేనే. అందులో నాకు క్రికెట్ అంటే తగని యిష్టం. ఆ రోజు స్కూల్లో క్రికెట్ మేచ్ జరుగుతోంది కాప్టెన్ను నేనే. ఎదుటి ప్రక్క ఆడుతున్న వాళ్ల కేప్టెన్

కిషోర్ చాలా మంచి తెలివైన వాడు. ఎలాగైనా గెలవాలన్న పంతంతో చాలా కష్టపడి ఆడేను నేను. నా అదృష్టం కొద్దీ ఆరోజే నా పార్టీ గెలిచింది. అందరూ నన్ను చాలా అభినందించేరు. ఆట ముగిసి బయటకి వొస్తుంటే ఎంతో బాగా ఆడారండీ. కంగ్రాచ్యులేషన్స్." అన్న వొక మధురమయిన స్వరం నన్ను వెనక్కి తిప్పింది. నన్ను మఱచి నేనొక క్షణం అలాగే నిలబడి పోయాను. "కంగ్రాచ్యులేషన్స్ గోపాల్" అంది అక్కడ నిలుచున్న ఆ అందమయిన అమ్మాయి నవ్వుతూ. నాకు చెప్పలేనంత సిగ్గువేసింది. థాంక్స్ చెప్పి మా జట్టులో కలిసిపోయేను.త

"ఆనాటి నుండీ మాలా నేను రోజూ వొకర్నొకరం చిరునవ్వుతో పలకరించుకునే వాళ్లం. స్కూల్లోనా మేచ్ యెక్కడ జరిగినా సరే మాల ఆ చోటికి తప్పక హాజరయేది. ఆ చిరునవ్వుతో కూడిన చక్కని ముఖమే నా గెలుపుకి సహాయ పడేది. ఆకర్షణీయమైన ఆ చల్లని చూపే నా వుత్సాహానికి తోడు పడేది. "ఇండియాకే గొప్ప క్రికెటరని పేరు పొందాలి గోపాల్ మీరు" అనేది నా మాల. "నీ యీ ప్రేమ యేనాడూ నామీద వుంటే నీ ముద్దు ముఖం నాదే అయితే, తప్పక అలాగే జరుగుతుంది మాలా" అనే వాణ్ణి నేను "నీ జయం నాతోనే వుంటే నేను నీ నీడగా మారిపోతాన్లే గోపాల్" అని నవ్వుతూ జవాబుఇచ్చేది మాల. రోజులు ఆనందంగా గడిచిపోయేయి

"మాలనీ నన్నూ వొకటి చేసిన క్రికెట్ నా జీవిత పరమావధి అయింది. భారతదేశం అంతా ఆడి వచ్చేను. ఎక్కడికెళ్లినా ఘనవిజయమే నా కెదురయేది. మాల కిష్టమైన క్రికెట్ కే నా జీవితం అర్పించేద్దా మనుకునే వాణ్ణి.

"మాల నాదైపోతేనా యీ జన్మ సార్థకం అవుతుందనుకునేవాణ్ణి. కాని యీనాటితో నా ఆశలన్నీ అడుగంటేయి. నా ప్రేమ జ్యోతి ఆరిపోయింది. మాల నాకు లేనినాడు నా యీ బ్రతుకెందుకు?"

గోపాల్ ముఖం ఒకసారి ఆవేదనతో నిండి పోయింది. విశాలమయిన అతని కళ్ళు నీళ్లతో నిండి పోయేయి. ఇంతకీ మాల యేమయిందో నాకర్థం అవలేదు. నేనిలా అనుకుంటుండగానే మా వారు "ఇంతకీ మాలకేం జరిగింది. గోపాల్.? ఎందుకింత బాధ పడుతున్నావు.?" అని గోపాల్ ని ప్రశ్నించేరు. "మాలకేం మహారాణీలా జీవిస్తోంది. నా జీవితాన్ని సర్వనాశనం చేసి తను సంతోషంగా వుంది. నా క్లాస్ మేట్ కిషోర్ ని వివాహం చేసుకుని సుఖంగా వుంది." గోపాల్ చెప్పలేక ఆగిపోయాడు. "మాల కిషోర్ ని పెళ్లి చేసుకుందని నీకెలా తెలిసింది?" అని మా వారు ప్రశ్నించేరు. "నేనీరోజు స్టేడియంలో ప్రవేశించే ముందు మాలని చూశాను. మాలని చూడగానే నా వుత్సాహం మరింత యెక్కువైంది. ఈ రోజు విజయం నాదే ననుకున్నాను. "ఏం మాలా, నాకు విజయం తెచ్చిపెట్టడానికే వచ్చావా?" అని పలకరించేను. కాని మాల యెప్పట్లా కాకుండా నా వేపు చూసి కూడా చూడనట్లు ముఖం తిప్పేసుకుంది. నా కెంతో ఆశ్చర్యం వేసింది. నా మాల నన్నిలా అవమానం చేస్తుందా.? ఒక వేళ నా మీద కోప మొచ్చిందేమో. నేనేం తప్పు చేసేనని? ఇలా నాలో నేను మధన పడుతుండగా నా ప్రక్కనుండే మాల నవ్వుతూ యెవరితోనో వెళుతోంది. ఎంత ఆశ్చర్యం! మాలతో వెళుతోంది మరెవరో కాదు. నా క్లాస్ మేట్ కిషోర్! ఇద్దరూ వొకర్నొకరు చూచి నవ్వుకుంటూ. వొకరి చేతులొకరు పట్టుకుని వయ్యారంగా నడుస్తున్నారు. నాకళ్లని నే నేనమ్మ లేకపోయేను. నా ప్రక్కనుండియెవరో ఇద్దరుమాట్లాడుకుంటూ వెళ్లినమాటలు నా చెవులలో పడ్డాయి. అందులో వొకరు "ఇప్పుడు యిటు పక్కనుంచీ కిషోర్ తో వెళ్లిందే తెల్ల చీరమ్మాయి, ఆమె పేరు మాల. పాపం మన క్రికెట్ కాప్టెన్ గోపాల్ ని మోసం చేసి కిషోర్ ని వివాహం చేసుకుంది." ఆ మాటలు విన్న నాకు తలమీద పిడుగు పడ్డట్టయింది. నా చుట్టు వున్న ప్రపంచమంతా గిఱ్ఱున తిరుగుతున్నట్టనిపించింది. స్టేడియంలో ప్రవేశించానే కాని నేనేం చెయ్యాలో నాకర్థం కాలేదు. క్రికెట్ ఆటలో నా అంతవాడు లేడనిపించుకున్న నేనే క్రికెట్ యెలా ఆడాలో మఱచి పోయాను. మొదటి సారి యెలా గెలిచానో కాని, రెండోసారి యిక ఆడలేక పోయాను. ప్రేమలో అపజయం పొందిన నాకు క్రికెట్ లో కూడా అపజయం యెదురైంది. ఇక నాకీ బ్రతుకెందుకు.? నా మాల లేని నేను బ్రతికుంటేనేం.? మరణిస్తేనేం.? ఇదే ఆఖరు ఈ జన్మలో యిక క్రికెట్. బాట్ ముట్టుకోను. క్రికెట్ ప్లేయర్ గోపాల్ యిక లేడు." ఇలా చెప్తూవున్న గోపాల్ వున్నట్లుండి యేదో భయంకర దృశ్యం చూచిన వాడిలా త్రుళ్లి పడ్డాడు. అటువేపు చూచిన నేగోపాల్ ను

యెందుకలా అయేడో తెలియలేదు. యెందుకంటే అటు వేపు మా చెల్లెలు మధూ, తమ్ముడు కృష్ణ వస్తున్నారు. మధు, కృష్ణ మా ప్రక్కనుంచే యేదో మాట్లాడు కుంటూ వెళ్తున్నారు. "పాపం! ఆటలో వోడిపోయినట్లున్నాడు మీ గోపాల్! కొంచం వోదార్చి రాకూడదూ?" అన్నాడు కృష్ణ. మొదట్నించీ అతని ఆటంటే నాకిషటం కాని అతనంటేనా? ?" అంది మధు. యింతలో గోపాల్ మా వారితో అంటున్నాడు. "ఇప్పుడిలా వెళ్లిన అమ్మాయే మాల, అతనే కిషోర్" అలా అయితే యింత సేపు గోపాల్ చెప్పిన మాల మా మధుమాల. కృష్ణ కృష్ణకిషోర్ అన్నమాట మేము యింట్లో మధూ, కృష్ణ అని పిలుస్తే స్కూల్లో మాల, కిషోర్ అని పిలుస్తారన్నమూట. ఇంతలో మా వారు "అలా అయితే గోపాల్ నువ్వు మరి యీ క్రికెట్ ఆడవన్నమాట" అన్నారు. "ఆడను! ఈ బేటే యిక ముట్టుకోను. ఇప్పుడే దీనికీ నాకు ఆఖరు" అని చేతిలోని బేట్ దూరంగా విసిరేశాడు. ఇంతలో మా వెనుకనుండి నవ్వులు వినిపించినై. చూస్తే మధూ, కృష్ణ. గోపాల్ మధుని చూసి ఆ చోటు నుండిలేచి పోబోయేడు. మా వారు గోపాల్ చెయ్యి పట్టుకు కుర్చిలో కూర్చోపెట్టేరు. ఆయన నన్ను గోపాల్‌కి చూపించి యీమె నా భార్య రాణి, మా మరదలు మధూ, అంటే నీ మాల, యితను మా బావమఱది కృష్ణ అంటే మీ కిషోర్. నేనెవరు? చెప్పు చూద్దాం" అన్నారు. గోపాల్ ముఖం ఒక్కసారి ఆశ్చర్యం, ఆనందం కలిసి ప్రకాశించింది.

ఆ తరువాత కొద్ది రోజులకీ మధూ, గోపాల్ వివాహం అతివైభవంగా జరిగింది. కథ సుఖాంతమే కాని, క్రికెట్ రసికులకి మాత్రం తీరని విషాదమేమిటంటే గోపాల్ మరి ఆ తరువాత క్రికెట్ మేచ్‌లో పాల్గొనక పోవడం.

★

